# పరిస్థితులు మారాయి.. మీరూ మారండి- చంద్రబాబు




అమరావతి, ఆగష్టు 5 : రానున్న ఐదేళ్లలో తాము నిర్దేశించుకున్న లక్ష్యాలు, అమలు చేసే బాధ్యత అధికారులపై ఉందన్నారు సీఎం చంద్రబాబునాయుడు. సెప్టెంబర్ 20 నాటికి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు అవుతుందన్నారు. సూపర్ సిక్స్ హామీలు ఇచ్చామని, దానికి కమిటై ఉన్నామన్నారు. సింపుల్ గవర్నమెంట్, ఎఫెక్టివ్ గవర్నెన్స్ మా విధానమన్నారు. పరదాలు కట్టడం, చెట్లు నరకడాలు ఉండ కూడదన్నారు ముఖ్యమంత్రి. అమరావతిలో నేడు జరిగిన జిల్లాల కలెక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తాను అందర్నీ కంట్రోల్ చేస్తున్నానని అంటూ పరిపాలన అనేది సర్వీసు మూడ్‌లో ఉండాలని, అధికారాన్ని చెలాయించే పద్ధతిలో ఉండడం సరికాదని సున్నితంగా హెచ్చరించారు. ఇన్నాళ్ల మారిదిగా రాజకీయాలు లేవని, ఇప్పుడు మారాయని గుర్తు చేశారు.

1995 నాటి చంద్రబాబును చూస్తారని అంటున్నానని, మీరు ఇంకా ఆ స్పీడ్ రాలేదని చురకలు అంటించా రు ముఖ్యమంత్రి. త్వరలో ఆకస్మిక తనిఖీలకు తాను వస్తానని చెప్పకనే చెప్పారు. ఆనాడు.. మంత్రులు, అధికారులు పరిగెత్తారు.. పరిగెత్తించామన్నారు. మేం పని చేస్తామని, మీతో పని చేయిస్తామన్నారు. విజన్ 2020ని ఆనాడు చాలామంది ఎగతాళి చేశారని, ఇప్పుడు విజన్ 2047 టార్గెట్ అని గుర్తుచేశారు.

ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేస్తున్నవారిని చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. విష ప్రచారం చేస్తున్నవారికి కౌంటర్ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. 36 మందిని చంపేశారని ఢిల్లీకి వెళ్లి ధర్నా చేశారని దుయ్యబట్టారు. ఆ పేర్లు అడిగితే ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. ఈ క్రమంలో భట్టిప్రోలు వ్యవహా రాన్ని వివరించారు. ఇలాంటి విషయాలపై రైట్ టైమ్‌లో చెప్పకపోతే ఫేక్ వ్యక్తులు సోషల్‌మీడియాలో ఇష్టానుసారంగా బురద జల్లే అవకాశం ఉందన్నారు.

ప్రతీ విషయాన్ని హ్యూమన్ యాంగిల్‌లో చూస్తే సమస్యకు పరిష్కారం లభిస్తుందన్నారు సీఎం . వల్గర్ లాంగ్వేజ్ వాడడం, అధికారం ఉందని పెత్తందారిగా వ్యవహరించడం ఉండకూడదన్నారు. ప్రతి నెలా ఒకటిన 'పేదల సేవలో' పేరుతో కొత్త కార్యక్రమం చేస్తున్నామన్నారు. మనందరం ప్రజల కష్టాలు తెలుసుకుని, పేదరికం లేని సమాజం కోసం పని చేయాలన్నారు.

"మనం తీసుకునే నిర్ణయాల వల్ల వ్యవస్థలే మారే పరిస్థితి ఉంటుంది. మంచి నిర్ణయాలు తీసుకుంటే భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుంది. మనమంతా కష్టపడితే 2047 నాటికి ప్రపంచంలోనే మనం నంబర్ వన్‌గా ఉంటాం. ఈ కలెక్టర్ల సదస్సు చరిత్ర తిరగరాయబోతోంది. ప్రజావేదికలో ఆనాటి సీఎం కలెక్టర్ల సదస్సు పెట్టి కూలగొట్టేశారు. విధ్వంసంతో పాటు పనిచేసే అధికారులను పక్కనబెట్టారు.. బ్లాక్ మెయిల్ చేశారు. బ్రాండ్ ఏపీని దెబ్బతీసేలా గత ఐదేళ్ల పాలన సాగింది. ఒకప్పుడు ఆంధ్రా అధికారులంటే దిల్లీలో ఒక గౌరవం ఉండేది. ఇప్పుడు చులకన భావం కలిగే పరిస్థితిని తీసుకొచ్చారు. ఆ పరిస్థితిని నుంచి అందరు బయటపడి కొత్త దనంతో మెరుగైన ఫలితాలను అందించాలి" అని కలెక్టర్ల్ కు పిలుపు ఇచ్చారు..

ఇక ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, పలువురు మంత్రులు, వివిధ జిల్లాల కలెక్టర్లు, ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు హాజరయ్యారు.

# ఇటిక్యాలపల్లిలో కార్డెన్ సెర్చ్.. రికార్డు స్థాయిలో వాహనాల స్వాధీనం



అమరావతి, ఆగష్టు 5 : గ్రామాన్ని దిగ్బంధనం చేసి పోలీస్ అధికారులు గ్రామంలోకి వచ్చి నెంబర్ ప్లేట్లు, సరైన పత్రాలు లేని వాహనాలను సాధీనంలోకి తీసుకున్న సంఘటన వరంగల్ జిల్లా నర్సంపేట మండలం ఇటిక్యాలపల్లిలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. నర్సంపేట మండలం ఇటిక్యాలపల్లి గ్రామంలో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్వహించిన కార్డెన్ సెర్చ్ లో రికార్డు స్థాయిలో వాహనాలను పోలీసులు స్వాధీనపరుచుకున్నారు.

వరంగల్ సీపీ అంబర్ కిషోర్ ఝా, వరంగల్ ఈస్ట్ జోన్ డీసీపీ రవీందర్ ఆదేశాల మేరకు ఇటకాలపల్లి లో కార్డెన్ సెర్చ్ లో 40, ద్విచక్ర వాహనాలను,10 ఆటోలు, 10 లీటర్ల నాటు సారా, 40 అంబర్ ప్యాకెట్ సీజ్ చేయడం జరిగిందని నర్సంపేట ఏసీపీ కిరణ్ కుమార్ తెలిపారు.

గ్రామస్తులను సమావేశ పరిచి వారికి సైబర్ క్రైమ్, నార్కోటిక్ డ్రగ్స్, గంజాయి, ట్రాఫికింగ్, డయల్ 100 గురించి, 1930 సైబర్ క్రైమ్ గురించి, కొత్త చట్టాల పైన ఏసీపీ కిరణ్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో నర్సంపేట నర్సంపేట సిఐ దక్షిణామూర్తి, దుగ్గొండి, నెక్కొండ సిఐలు చంద్రమోహన్ రాజగోపాల్, ఎక్సైజ్ శాఖ సీఐ నరేష్ రెడ్డి, నల్లబెల్లి, ఖానాపురం, నెక్కొండ ఎస్ఐ పోలీస్ సిబ్బంది,నర్సంపేట సబ్ డివిజన్ పోలీసులు పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్‌లో జలకళ.. ఆరు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

నాగార్జునసాగర్ ఆగష్టు 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఎగువన భారీ వర్షాలతో కృష్ణానది వరవళ్లు తొక్కుతున్నది. వరద పోటెత్తడంతో ఆలమట్టి నుంచి శ్రీశైలం వరకు కృష్ణా, దాని ఉపనదులపై ఉన్న ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేశారు.

దీంతో నల్లగొండ జిల్లాలోని నాగార్జున సాగర్ ప్రాజెక్టుకు పెద్దఎత్తున వచ్చిచేరుతున్నది.

క్రమంగా ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకోవడంతో అధికారులు.. సాగర్ గేట్లు తెరిచారు. ఒక్కొక్కటిగా మొత్తం ఆరు గేట్లు ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

ఉదయం 11 గంటలకు ఎస్ఈ నాగేశ్వరరావు, సీఈ అనిల్ కుమార్ కృష్ణమ్మకు జలహారతి ఇచ్చి నీటిని విడుదల చేశారు.

తొలుత దిగు ప్రాంతాల ప్రజల అప్రమత్తత కోసం మూడుసార్లు సైరన్ మోగించారు.

అనంతరం ఒక్కొక్కటిగా ఆరు గేట్లు ఎత్తారు. ప్రస్తుత సాగర్ క్రస్ట్ గేట్ల ద్వారా సుమారు 2 లక్షల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు అధికారులు తెలిపారు.

నీటిని విడుదల చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఈ సంవత్సరం రెండు పంటలకు ఇకా ఢోకా లేదని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

సోమవారం ఉదయం 8 గంటలకు సాగర్‌కు 4,41,183 క్యూసెక్కుల వరద వస్తుండగా, ఔట్‌ఫ్లో 40,516 క్యూసెక్కులుగా ఉంది. సాగర్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులుండగా, ప్రస్తుత నీటి మట్టం 580.40 అడుగులకు చేరుకుంది. డ్యామ్ నీటినిల్వ సామర్థ్యం 312.50 టీఎంసీలకు గానూ ప్రస్తుత నీటి నిల్వ 284.16 టీఎంసీలుగా ఉన్నది.




# ప్రయాణికురాలి తలలో పేలు.. విమానం ఎమర్జెన్సీ ల్యాండింగ్

న్యూ డిల్లీ ఆగష్టు 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);అమెరికన్ ఎయిర్‌లైన్స్ విమానంలోని ప్రయాణికులకు షాకింగ్ అనుభవం ఎదురైంది. సాధారణంగా ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితేనో, ప్రయాణికుల్లో ఎవరికైనా అత్యవసర వైద్య సాయం అవసరమైతేనో, బాంబు బెదిరింపులు, వాతావరణం సహకరించకపోవడం వంటివి జరిగినప్పుడు విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేయడం చూస్తుంటాం. అయితే, ఇక్కడ ఓ మహిళా ప్రయాణికురాలి తలలో పాకుతున్న పేలు విమానాన్ని ఎమర్జెన్సీ ల్యాండ్ చేసేలా చేశాయి. ఈ ఘటన జూన్‌లో జరగ్గా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికన్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన విమానం లాస్ ఏంజెల్స్ నుంచి న్యూయార్క్‌కు వెళ్తోంది. విమానం గాల్లో ఉండగా.. ఓ మహిళ తలలో పేలు పాకుతుండటాన్ని చూసిన తోటి ప్రయాణికులు విమాన సిబ్బందికి ఫిర్యాదు చేశారు. దీంతో విమానాన్ని ఫీనిక్స్‌లో ఎమర్జెన్సీ ల్యాండింగ్ చేశారు. ఈ ఘటనకు సంబంధించి ఎథాన్ జుడెల్సన్ అనే ప్రయాణికుడు తన అనుభవాన్ని 'టిక్‌టాక్' ద్వారా పంచుకున్నాడు. 'విమానాన్ని మళ్లిస్తున్నట్టు మాత్రమే విమాన సిబ్బంది సమాచారం ఇచ్చారు. దీంతో ప్రయాణికుల్లో అయోమయం నెలకొంది. నేను చుట్టూ చూశాను. ఎవరూ భయపడడం లేదు. అయినా విమానం ల్యాండ్ అయింది. ఆ వెంటనే ఓ మహిళ విమానం ముందు వైపునకు దూసుకెళ్లింది. ఆ తర్వాత విమానం ఎందుకు ఎమర్జెన్సీ ల్యాండ్ అయిందని తోటి ప్రయాణికుడిని అడిగితే అసలు విషయం తెలిసింది. ఓ మహిళ తలలో పేలు పాకుతుండటాన్ని ఇద్దరు ప్రయాణికులు చూసి విమాన సిబ్బందికి చెప్పారట. వారొచ్చి చూస్తే నిజంగానే ఆమె తలలో పేలు పాకుతుండటంతో.. విమానాన్ని అత్యవసరంగా ల్యాండ్ చేశారు' అని సదరు ప్రయాణికుడు వివరించారు. ఈ ఘటన కారణంగా విమానం 12 గంటలు ఆలస్యమైనట్లు చెప్పారు. అప్పటి వరకు ప్రయాణికు లకు విశ్రాంతి తీసుకునేందుకు హోటల్ సదుపాయాన్ని కల్పించినట్లు వివరించారు.

# రాజకీయాలు ఆపండి.. రిజర్వాయర్లలో నీళ్లు నింపండి...

న్యూఢిల్లీ, ఆగష్టు 5 :గత 8 నెలలుగా తెలంగాణలో పాలన పడకేసిందని, . ప్రతిపక్షంపై రాజకీయ విమర్శలు, దాడులు తప్ప మరేమీ లేదని అన్నారు మాజీ మంత్రి జగదీష్ రెడ్డి.. ఢిల్లీలో నేడు ఆయన మీడియాతో మాట్లాడుతూ, సాగునీటి రంగంలో ఘోరంగా విఫలమైందన్నారు. గత యాసంగి (రబీ) పంటకు నీళ్లు అందించలేకపోయిందని ఫైర్ అయ్యారు. గతంలో కేసీఆర్ పాలనలో యాసంగిలోనే భారీగా దిగుబడి వచ్చిందని తెలిపారు.

గోదావరి, కృష్ణా నదుల నుంచి నీరు లక్షలాది టీఎంసీల నీరు వృధాగా సముద్రం పాలవుతోందని, అయిన కాంగ్రెస్ పాలకులకు రిజర్వాయర్ లు నింపాలనే ఆలోచన చేయడం లేదని విమర్శించారు.. సముద్రంలోకి వెళ్లే ఆ నీటిని కాలువల ద్వారా చెరువులు నింపే అవకాశం ఉందని గుర్తుచేశారు. . కానీ ఈ ప్రభుత్వం ఆ పనిచేయడం లేదని మండిపడ్డారు. శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు నీళ్లు వస్తాయన్న సమాచారం ఉందని తెలిపారు. ఆ నీటిని సద్వినియోగం చేసుకోవాలన్న సోయి ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేశారు.

మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో వర్షాభావం కారణంగా కరువు పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. నాగార్జున సాగర్ ఎడమ కాలువకు నీటిని విడుదల చేసి అన్ని రిజర్వాయర్లు, చెరువులు నింపాలన్నారు. ఖమ్మం జిల్లా పాలేరు కూడా ఖాళీగా ఉందని.. ఆ రిజర్వాయర్ సహా దాని కింద ఉన్న చెరువులు నింపాల్సిన అవసరం ఉందన్నారు.

కృష్ణా నది నీటిని కిందికి వదిలి సముద్రం పాలు చేస్తున్నారని.. కాళేశ్వరం మోటర్లతో నీటిని ఎత్తిపోసి సూర్యాపేట వరకు నీటిని తీసుకురావాలని కోరారు. ఎస్సారెస్పీ ద్వారా నీళ్లు ఇవ్వవచ్చు అని కాంగ్రెస్ నేతలు అన్నారని.. మరి ఎస్సారెస్పీ నుంచి ఎందుకు సూర్యాపేటకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. సుందిళ్ల, అన్నారం బ్యారేజీలపై బద్నాం చేస్తున్నారని. రైతులకు నీళ్లు ఇవ్వలేక నిందను, నెపాన్ని కాళేశ్వరంపైకి నెట్టేస్తున్నారని సీరియస్ అయ్యారు. సుందిళ్ల, అన్నారం ద్వారా ఎల్లంపల్లి నింపాలని కోరారు. తద్వారా వరంగల్, సూర్యాపేటకు నీళ్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లె తెరచి కన్నెపల్లి నుంచి వెంటనే నీటిని లిఫ్ట్ చేయాలని డిమాండ్ చేశారు మరో మంత్రి గంగుల కమలాకర్ .. ఎల్లంపల్లి నుంచి కేవలం 11 టీఎంసీల నీరు మాత్రమే రాగా, మిడ్ మానేరు, లోయర్ మానేరు నుంచి ఒక్క చుక్క నీరు రాలేదన్నారు.. వరద వస్తేనే నీటిని ఇస్తామని ప్రభు త్వం చెబుతోందని అయితే గోదావరి నీరు వృధాగా సముద్రంలోకి పోతున్నా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు..

# సమష్టి కృషి ద్వారానే అవయవదానం, మార్పిడిలో అగ్రగామి దేశాల్లో ఒకటిగా ఎదుగుతాం

న్యూఢిల్లీ, ఆగష్టు 5 :"దేశంలో అవయవ దానం అవసరం ఎంతో ఉంది. ఇందు కోసం చనిపోయిన వ్యక్తుల నుంచి, "బ్రెయిన్ స్టెమ్ డెడ్" వ్యక్తుల నుండి అవయవ దానాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అవయవ దానం అవసరాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రధానంగా ప్రస్తావిస్తూ.. ఒక అవయవ దాత 8 మందికి కొత్త జీవితాన్ని ఇవ్వగలరనే విషయంపై దృష్టి సారించాలని సూచించారు" అని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీమతి అనుప్రియ పటేల్ పేర్కొన్నారు. జాతీయ అవయవ, కణజాల మార్పిడి సంస్థ(ఎన్ఓటీటీఓ) నిర్వహించిన 14వ భారత అవయవదాన దినోత్సవ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నీతి ఆయోగ్ సభ్యుడు (ఆరోగ్యం) డాక్టర్ వీకే పాల్ కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఈ సందర్భంగా శ్రీమతి పటేల్ మాట్లాడుతూ, ఎంతోమంది ప్రాణాలను కాపాడి మానవాళికి గొప్ప సేవ చేస్తున్న అవయవ దాతల కుటుంబ సభ్యులను కొనియాడారు. వారు యావత్ దేశానికి స్ఫూర్తి ప్రదాతలని పేర్కొంటూ, మరణించిన తర్వాత తమ అవయవాలను దానం చేస్తామని ప్రతిజ్ఞ చేయడానికి ముందుకు రావాలని ఆమె దేశ ప్రజలనుకోరారు. "ప్రతి వ్యక్తి, సంస్థల సమిష్టి కృషి ద్వారానే అవయవదానం, అవయవ మార్పిడిలో అగ్రగామి దేశాల్లో ఒకటిగా ఎదగాలన్న తన దార్శనికతను భారత్ సాకారం చేసుకోగలుగుతుందని" ఆమె అన్నారు.

అవయవ దానంలో స్పెయిన్, అమెరికా, చైనా వంటి అనేక దేశాలు చాలా ముందున్నప్పటికీ, మన దేశం ఇటీవలి కాలంలో ఈ రంగంలో కొన్ని చెప్పుకోదగిన విజయాలు సాధించిందని కేంద్ర మంత్రి అన్నారు. అవయవ మార్పిడికి ముందు అవి ఏ విధంగానూ పాడైపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె అధికారులను కోరారు.

డాక్టర్ వినోద్ కుమార్ పాల్ మాట్లాడుతూ, అవయవాల డిమాండ్ కు, సరఫరాకు మధ్య భారీ వ్యత్యాసం ఉందని, అవయవ మార్పిడి సవాలును స్వీకరించడానికి ప్రభుత్వ ఆసుపత్రుల్లో సంస్థాగత సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. అవయవ మార్పిడి సేవలను కేవలం 750 సంస్థలు మాత్రమే అందిస్తున్నాయని, ఇతర సంస్థలు కూడా ఇలాంటి సేవలు అందించేందుకు ముందుకు రావాలని కోరారు.

ఆయుష్మాన్ భారత్ ప్రధాన మంత్రి జన్ ఆరోగ్య యోజన(ఏబీపీఎం – జేవై) పరిధిలోకి మూత్ర పిండాల మార్పిడి కూడా వచ్చిందని డాక్టర్ పాల్ చెప్పారు. అవయవ మార్పిడిని బీమా కంపెనీలు పరిగణన లోకి తీసుకోవాలని డాక్టర్ పాల్ కోరారు. అవయవ మార్పిడిని సులభతరం చేయడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన "వన్ నేషన్, వన్ పాలసీ" వంటి గణనీయ ప్రయత్నాల వల్ల అవయవ మార్పిడికి అడ్డంకులు తొలగిపోతున్నాయని ఆయన తెలిపారు. అవయవదాతలకు నివాళులు అర్పిస్తూ, ఈ మహోన్నత కార్యానికి ప్రజలంతా ఐక్యంగా ముందుకు రావాలని ఆయన పిలుపు ఇచ్చారు.

కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీ అపూర్వ చంద్ర మాట్లాడుతూ, అవయవదానం కోసం పెద్ద సంఖ్యలో ప్రజలు నమోదు చేసుకుంటున్నందున అవయవదానంపై అవగాహన మరింత పెంచాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. అవయవ మార్పిడిలో భారత్ మూడో స్థానంలో ఉన్నప్పటికీ, అవయవ దానం కుటుంబ సభ్యుల మధ్య ఎక్కువగా జరుగుతుందని, అందరికి లబ్ది కలిగేలా అవయవ దానానికి నమోదు చేసుకోవడానికి ప్రజలను మరింత ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

"అవయవ వృథా జరగకుండా ఉండాలంటే మన వ్యవస్థను బలోపేతం చేసుకోవాలి. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి విషయంలో అవయవాలు తీసుకోవడానికి సమయం తక్కువగా ఉంటుంది. 12 గంటల్లో అవయవాలను సేకరించి తక్కువ సమయంలోనే మార్పిడి చేయాల్సి ఉంటుంది. అందువల్ల, మనం మన వ్యవస్థలను మెరుగుపరచాలి. ఇది ఎన్ఓటీటీఓ, ఎస్ఓటీటీఓ, ఆర్ఓటీటీఓ లపై పెద్ద బాధ్యత" అని ఆయన స్పష్టం చేశారు.

అవయవదానం చేసిన 10 మంది మృత దాతల కుటుంబ సభ్యులు, నలుగురు అవయవ గ్రహీతలను కేంద్ర మంత్రి ఈ సందర్భంగా సన్మానించారు. అవయవ దానం, మార్పిడి లో ఉత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, ప్రాంతీయ, రాష్ట్ర అవయవ, కణజాల మార్పిడి సంస్థలు, వైద్య కళాశాలలు , సంస్థలు, ప్రొఫెషనల్ సొసైటీలు, వైద్య నిపుణులు, వివిధ ప్రభుత్వేతర సంస్థలకు అవార్డులు ప్రదానం చేశారు.

రోటో నార్త్ – పీజీఐఎంఈఆర్, చండీగఢ్ ఉత్తమ రోటో అవార్డును గెలుచుకుంది. తెలంగాణకు ఉత్తమఎస్ఓటీటీఓ /స్టేట్ అవార్డు దక్కగా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలు రెండో ఉత్తమ ఎస్ఓటీటీఓ /స్టేట్ అవార్డును దక్కించుకున్నాయి. మణిపూర్ కు బెస్ట్ ఎమర్జింగ్ స్టేట్ ఇన్ నార్త్ ఈస్ట్ అవార్డు లభించింది. అవయవ దానంలో ఎమర్జింగ్ స్టేట్స్ అవార్డు పొందిన రాష్ట్రాలు: 1) ఆంధ్రప్రదేశ్ 2) మధ్యప్రదేశ్, 3) జమ్ముకశ్మీర్. ఉత్తమ నాన్ ట్రాన్స్ ప్లాంట్ ఆర్గాన్ రిట్రీవల్ సెంటర్స్ (ఎన్ టీ ఓ ఆర్ సీ) అవార్డును అహ్మదాబాద్ లోని సివిల్ హాస్పిటల్ అందుకుంది. ఎమర్జింగ్ ఎన్ టీ ఓ ఆర్ సీ అవార్డులు: 1. కమాండ్ హాస్పిటల్, చాందమందిర్, 2. డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, హిమాచల్ ప్రదేశ్ కు లభించాయి. ఉత్తమ అవగాహన/ ఐ ఇ సి యాక్టివిటీస్ ఉన్న రాష్ట్రంగా రాజస్థాన్ కు అవార్డు లభించింది. సికింద్రాబాద్ లోని యశోద ఆస్పత్రికి అత్యున్నత విరాళం పురస్కారం లభించింది. మరణించిన అవయవ దానం కార్యక్రమాన్ని సమర్థవంతంగా పునరుద్ధరించినందుకు కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి ప్రత్యేక అవార్డు న్యూఢిల్లీలోని సఫ్దర్ జంగ్ ఆసుపత్రి గెలుచుకుంది. చనిపోయిన అవయవదాన కార్యక్రమాన్ని స వం వంతంగా పునరుద్ధరించినందుకు స్టేట్ హాస్పిటల్ ప్రత్యేక అవార్డును ముంబైలోని కెఇఎమ్ హాస్పిటల్ అందుకుంది. ఉత్తమ బ్రెయిన్ స్టెమ్ డెత్ సర్టిఫికేషన్ టీమ్ గుర్తింపు పొందిన వాటిలో (ప్రాంతాల వారీగా) : 1. వెస్ట్ – న్యూ సివిల్ హాస్పిటల్, సూరత్; 2. నార్త్ – ఆల్ఎంఎస్, ఢిల్లీ; 3. దక్షిణం – కిమ్స్, సికింద్రాబాద్; 4. ఈస్ట్ – ఐపీజీఎంఈఆర్, కోలకతా ఉన్నాయి.

ఈ కార్యక్రమంలో ఇ–న్యూస్ లెటర్, నాటో వార్షిక నివేదిక, ఆర్గాన్ ట్రాన్స్ పోర్ట్ స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్ (ఎస్ఓపి) ను వివరించే మాన్యువల్ లను ఆవిష్కరించారు.

ఆజాదీ కా అమృత్ మహోత్సవ్లో భాగంగా 2023లో 'జన్ ఆందోళన్'గా దేశవ్యాప్తంగా ' అవయవ దానమహోత్సవ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. జూలై నెలను అవయవదాన మాసంగా పాటిస్తారు. ఈ సంవత్సరం "అంగ్ దాన్ జన్ జాగృత అభియాన్" అనే ప్రచారం కింద, అన్ని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు / విభాగాలు, రాష్ట్ర / కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు / జాతీయ, ప్రాంతీయ , రాష్ట్ర అవయవ ,కణజాల నెట్వర్కింగ్ సంస్థలు / ఆసుపత్రులు / సంస్థలు ,వైద్య కళాశాలలు, ఎన్ జి ఒ , ఇతర భాగస్వాముల ద్వారా నగరం నుండి గ్రామ స్థాయి వరకు దేశవ్యాప్తంగా వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో నోటో డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్, ఢిల్లీ పోలీసు సిబ్బంది, అవయవ గ్రహీతలు, విద్యార్థులు, కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖకు చెందిన సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు.

అవయవ, కణజాల దానాన్ని ప్రోత్సహించడానికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. గౌరవ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ "మన్ కీ బాత్" కార్యక్రమంలో అవయవదానం ప్రాముఖ్యతను అనేకసార్లు ప్రస్తావించారు.

బ్రెయిన్ స్టెమ్ డెత్ , అవయవ దానం గురించి అవగాహన పెంచడానికి, అవయవ దానంతో సంబంధం ఉన్న అపోహలను, అపనమ్మకాలను తొలగించడానికి , మరణించిన తర్వాత అవయవాలు కణజాలాలను దానం చేసేలా దేశ పౌరులను ప్రేరేపించడానికి , ప్రోత్సహించడానికి, అలాగే అవయవ దానం విలువలను తమ జీవితాల్లో నింపుకోవడానికి 2010 నుండి ప్రతి సంవత్సరం భారతీయ అవయవ దానం దినోత్సవం (ఐఒడిడి) ని నిర్వహిస్తున్నారు. అవయవ మార్పిడి కోసం డిమాండ్‌ను తగ్గించడానికి, ప్రచార కార్యకలాపాలు ఆరోగ్యకరమైన జీవనశైలిని, ఆరోగ్యాన్ని అనుసరించడాన్ని ప్రోత్సహిస్తాయి. అవయవ వైఫల్యం నివారణకు చర్యలు తీసుకుంటాయి. అవయవ మార్పిడి కోసం అవయవాలు అవసరమైన వారి సంఖ్యకు, దాతల సంఖ్యకు మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చడానికి ప్రజలు అవయవాలను దానం చేసేలా అవగాహన పెంచేందుకు ప్రేరేపించడానికి 14 వ ఐ ఒడిడి ఒక అవకాశం.

దానం చేసిన ప్రతి అవయవం విలువైనది, ప్రాణరక్షణ, జాతీయ వనరు. ఒక వ్యక్తి మరణించిన తరువాత మూత్రపిండాలు, కాలేయం, ఊపిరితిత్తులు, గుండె, క్లోమం , ప్రేగు వంటి ముఖ్యమైన అవయవాలను దానం చేయడం ద్వారా 8 మందికి కొత్త జీవితాన్ని ఇవ్వగలడు. కార్నియా, చర్మం, ఎముక ,గుండె వాల్వ్ వంటి కణజాలాలను దానం చేయడం ద్వారా మరింత మంది నాణ్యమైన జీవితాలను మెరుగుపరచవచ్చు.

ఒక ఉదాత్తమైన లక్ష్యం కోసం ప్రతిజ్ఞ చేయడానికి ,ఈ జాతీయ ప్రయత్నంలో భాగస్వామ్యం కావడానికి ప్రజలు ముందుకు రావాలని ప్రోత్సహించడం జరిగింది. అవయవదానం, మార్పిడిపై ఏదైనా సమాచారం కోసం www.notto.mohfw.gov.in ని వెబ్ సైట్ ను సందర్శించవచ్చు లేదా టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నంబర్ 180114770 కు కాల్ చేయవచ్చు.

ఈ సంవత్సరం "అంగ్ దాన్ జన్ జాగృక్త అభియాన్" ప్రచారం కింద, అన్ని కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు / విభాగాలు, రాష్ట్ర / కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు / జాతీయం, ప్రాంతీయ ,రాష్ట్ర అవయవ, కణజాల నెట్వర్కింగ్ సంస్థలు / ఆసుపత్రులు / సంస్థలు ,వైద్య కళాశాలలు, ఎన్ జి ఒ లు , ఇతర భాగస్వాములతో నగరం నుండి గ్రామ స్థాయి వరకు వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు.

అభియాన్ కింద జూలై నెలను అవయవదాన మాసంగా పాటించారు. అవయవ, కణజాల దానం కోసం పౌరులు ప్రతిజ్ఞ చేయడానికి వీలుగా, https://notto.abdm.gov.in ని వెబ్ పోర్టల్ అందుబాటు లో ఉంది. దీని ద్వారా 2023 సెప్టెంబర్ 17 నుండి ఇప్పటివరకు 1.7 లక్షల మందికి పైగా పౌరులు ముందుకు వచ్చి తమ ప్రతిజ్ఞను నమోదు చేశారు.

# భారతదే వ్యవసాయ సంప్రదాయాల్లో శాస్త్రానికి, తర్కానికి ప్రాధాన్యత: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 5 :అంతర్జాతీయ వ్యవసాయ ఆర్థికవేత్తల 32వ సమావేశాన్ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. న్యూఢిల్లీలోని జాతీయ వ్యవసాయశాస్త్ర కేంద్రం ( ఎన్ ఏ ఎస్ సి) సముదాయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈ ఏడాది సమావేశ థీమ్ సుస్థిర వ్యవసాయ, ఆహార వ్యవస్థల దిశగా పరివర్తన. వాతావరణ మార్పు, సహజ వనరుల క్షీణత, పెరుగుతున్న ఉత్పత్తి వ్యయాలు , సంఘర్షణల వంటి ప్రపంచ సవాళ్లను ఎదుర్కొని స్థిరమైన వ్యవసాయ అత్యవసర అవసరాన్ని చాటడమే ఈ సమావేశ లక్ష్యం. దాదాపు 75 దేశాల నుంచి 1,000 మంది ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

65 సంవత్సరాల తర్వాత భారతదేశంలో ఈ సమావేశాన్ని నిర్వహించడంపట్ల ప్రధాన మంత్రి తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. 123 మిలియన్ల మంది రైతులు, 30 మిలియన్లకుపైగా మహిళా రైతులు, 30 మిలియన్ మత్స్యకార రైతులు, 80 మిలియన్ పాడి రైతుల తరఫున సమావేశ ప్రతినిధులకు ప్రధాని ఆహ్వానం పలికారు. 500 మిలియనకు పైగా పశుసంపదను కలిగిన దేశానికి మీరు వచ్చారు. వ్యవసాయాన్ని, పశుసంపదను ప్రేమించే భారతదేశంలోకి మీకు ఆహ్వానం పలుకుతున్నాను అంటూ ప్రధాని ఘనంగా స్వాగతం పలికారు.

వ్యవసాయరంగం, ఆహారం గురించి ప్రాచుర్యంలో వున్న ప్రాచీన భారతీయ నమ్మకాలు , అనుభవాల దీర్ఘకాలతను ప్రధాన మంత్రి తన ప్రసంగంలో గట్టిగా నొక్కి చెప్పారు. భారతీయ వ్యవసాయ సంప్రదాయంలో శాస్త్రం, తార్కిక జ్ఞానానికి ఇచ్చిన ప్రాధాన్యతను ఆయన తన ప్రసంగంలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఆహార ఔషధ గుణాల వెనుక వున్న మొత్తం శాస్త్ర విజ్ఞాన అస్థిత్వాన్ని ఆయన ప్రస్తావించారు.

సుసంపన్నమైన వారసత్వం ఆధారంగా రచించిన, దాదాపు 2000 సంవత్సరాల నాటి వ్యవసాయ గ్రంథం 'కృషి పరాశర' గురించి ప్రధాన మంత్రి తన ప్రసంగంలో ప్రస్తావించారు. ఈ వేల సంవత్సరాల నాటి దృక్పథం ఆధారంగా వ్యవసాయం వృద్ధి చెందిందని ప్రధాన మంత్రి తన ప్రసంగంలో స్పష్టం చేశారు. భారతదేశంలో వ్యవసాయ పరిశోధన, విద్యారంగాల్లో బలమైన వ్యవస్థ వుందని ప్రధాని అన్నారు. ఐసిఏఆర్ స్వయంగా 100 కంటే ఎక్కువ పరిశోధనా సంస్థలను కలిగి ఉంది" అని ఆయన చెప్పారు. వ్యవసాయ విద్య కోసం 500లకు పైగా కళాశాలలు, 700కి పైగా కృషి విజ్ఞాన కేంద్రాలు దేశంలో ఉన్నాయని ఆయన వివరించా రు.

భారతదేశ వ్యవసాయ ప్రణాళిక లోని మొత్తం ఆరు రుతువుల ఔచిత్యాన్ని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, దేశంలోగల 15 వ్యవసాయ–వాతావరణ మండలాల ప్రత్యేక లక్షణాలను ప్రధాన మంత్రి తన ప్రసంగంలో వివరించారు. దేశంలో వంద కిలోమీటర్లు ప్రయాణిస్తే వ్యవసాయ ఉత్పత్తులు మారిపోతాయని ప్రధాని పేర్కొన్నారు. "భూమి, హిమాలయాలు, ఎడారి, నీటి కొరత ఉన్న ప్రాంతాలు లేదా తీర ప్రాంతాలలో ఎక్కడ వ్యవసాయం చేసినా సరే, ప్రపంచ ఆహార భద్రతకు ఈ వైవిధ్యం చాలా కీలకమని ఇది భారతదేశాన్ని ప్రపంచానికి ఆశాకిరణంగా మార్చిందని ప్రధాని వ్యాఖ్యానించారు.

65 సంవత్సరాల క్రితం భారతదేశంలో జరిగిన వ్యవసాయ ఆర్థికవేత్తల అంతర్జాతీయ సదస్సును తన ప్రస్తంగంలో ప్రస్తావించిన ప్రధాన మంత్రి, నాడు భారతదేశం కొత్తగా స్వతంత్ర దేశంగా మారిన విషయాన్ని గుర్తు చేశారు. నాడు భారతదేశ ఆహార భద్రత, వ్యవసాయరంగాలను భారతదేశం సవాలుగా తీసుకుందని అన్నారు. నేడు భారతదేశం ఆహార మిగులు దేశమని, పాలు, పప్పులు. సుగంధ ద్రవ్యాల అతిపెద్ద ఉత్పత్తిదారుగా మారిందని,ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, పత్తి, చక్కెర, టీ, చేపల పెంపకంలో ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద దేశం అని ప్రధాన మంత్రి అన్నారు. నాడు భారతదేశ ఆహార భద్రత ప్రపంచానికి ఆందోళన కలిగించే విషయంగా వుండేదని, నేడు ప్రపంచ ఆహార, పోషకాహార భద్రతకు భారతదేశం పరిష్కారాలను అందిస్తోందని ఆయన తన ప్రసంగంలో గుర్తు చేశారు. అందువల్ల, ఆహార వ్యవస్థ పరివర్తనపై చర్చల్లో భారతదేశ అనుభవం అమూల్యమైనదిగా పరిగణించాలని, ఇది ప్రపంచ దక్షిణాదికి ఖచ్చితంగా ప్రయోజనం చేకూరుస్తుందని ప్రధాన మంత్రి అన్నారు.

విశ్వ బంధువుగా పేరొందిన భారతదేశం ప్రపంచ సంక్షేమానికి నిబద్ధతతో కృషి చేస్తోందని ప్రధాని మోదీ తన ప్రసంగంలో పునరుద్ఘాటించారు. ప్రపంచ సంక్షేమం కోసం భారతదేశ దృక్పథాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. ఒకే భూమి, ఒకే కుటుంబం, ఒక భవిష్యత్తు', 'మిషన్ లైఫ్, ఒకే భూమి ఒకే ఆరోగ్యం' సహా వివిధ వేదికలపై భారతదేశం ప్రకటించిన వివిధ మంత్రాలను (విధానాలను) ప్రసంగంలో ప్రధాని ప్రస్తావించారు. స్థిరమైన వ్యవసాయం, ఆహార వ్యవస్థల ముందున్న సవాళ్లను 'ఒకే భూమి, ఒకే కుటుంబం ఒక భవిష్యత్తు' అనే సమగ్ర విధానంలో మాత్రమే పరిష్కరించగలమని ఆయన అన్నారు.

భారత ఆర్థిక విధానాలకు వ్యవసాయం కేంద్రబిందువుగా ఉంది అని భారతదేశంలోని 90 శాతం మంది రైతులు తక్కువ భూమిని కలిగి ఉన్నారని, వారు భారతదేశ ఆహార భద్రతను బలోపేతం చేస్తున్నారని ప్రధాని స్పష్టం చేశారు. ఆసియాలోని అనేక అభివృద్ధి చెందుతున్న దేశాలలో ఇదే పరిస్థితి ప్రబలంగా ఉందని భారతదేశ నమూనాను ఆయా దేశాలలో వర్తింపజేయవచ్చని ఆయన సూచించారు. దేశంలో జరుగుతున్న సహజ వ్యవసాయాన్ని ఉదాహరణగా చూపుతూ, రసాయన రహిత సహజ వ్యవసాయాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించడం వల్ల దేశంలో సానుకూల ఫలితాలు కనిపిస్తున్నాయని ప్రధాన మంత్రి అన్నారు. ఈ ఏడాది బడ్జెట్‌లో సుస్థిరమైన, వాతావరణాన్ని తట్టుకోగలిగే వ్యవసాయంపై పెద్ద ఎత్తున దృష్టి పెట్టామని అన్నారు. భారతదేశ రైతులకు మద్దతుగా పూర్తి పర్యావరణ వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోగల పంటలకు సంబంధించిన పరిశోధన, అభివృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను ఎత్తి చూపుతూ, గత 10 సంవత్సరాలలో కొత్త ప్రతికూల వాతావరణాన్ని తట్టుకోగల 19 వందల రకాలపంటలను (విత్తనాలను) రైతులకు అందజేసినట్లు ప్రధాన మంత్రి తెలియజేశారు. సాంప్రదాయ రకాలతో పోలిస్తే 25 శాతం తక్కువ నీరు అవసరమయ్యే భారతదేశ వరి రకాలగురించి వివరించారు. బ్లాక్ రైస్ ( నల్ల బియ్యం) సూపర్ ఫుడ్‌గా ఆవిర్భవి ంచిందని ఆయన ఉదాహరణలు ఇచ్చారు. "మణిపూర్, అస్సాం, మేఘాలయలలో నల్ల బియ్యం ఔషధ విలువల కారణంగా అక్కడ ఎక్కువగా వాడుతున్నారని ప్రధాని అన్నారు. భారతదేశం ఇలాంటి అనుభవాలను ప్రపంచంతో పంచుకోవడానికి ఆసక్తిని చూపుతోందని ప్రధాని వివరించారు.

నీటి కొరత, వాతావరణ మార్పుల తో పాటు పోషకాహార సవాళ్ల తీవ్రతను ప్రధాన మంత్రి తన ప్రసంగంలో వివరించారు. 'కనీస నీరు, గరిష్ట ఉత్పత్తిస విధానం కింద పండే పంటల గురించి తెలిపారు. సూపర్‌ఫుడ్ నాణ్యతను కలిగిన శ్రీ అన్న, చిరుధాన్యాలను ఒక పరిష్కారంగా ఆయన పేర్కొన్నారు.. భారతదేశ చిరుధాన్యాలను ప్రపంచంతో పంచుకోవడానికి భారతదేశం సుముఖంగా వుందని , గత సంవత్సరాన్ని అంతర్జాతీయ చిరుధా న్యాల సంవత్సరంగా జరుపుకున్నామని గుర్తు చేశారు.

వ్యవసాయాన్ని ఆధునిక సాంకేతికతతో అనుసంధానం చేసే కార్యక్రమాలను గురించి ప్రధాని తన ప్రసంగంలో ప్రస్తావించారు. భూసార పరీక్షల వివరాలను తెలిపే కార్డ్, సౌర విద్యుత్ సాయంతో వ్యవసాయం చేసే రైతులను ఇంధన ప్రదాతలుగా మార్చడం , డిజిటల్ వ్యవసాయ మార్కెట్ అంటే ఈ–నామ్, కిసాన్ క్రెడిట్ కార్డ్, పీఎం ఫసల్ బీమా యోజన వంటి వాటి గురించి ప్రధాన మంత్రి తన ప్రసంగంలో మాట్లాడారు. సాంప్రదాయ రైతుల నుండి వ్యవసాయ అంకుర సంస్థల వరకు( అగ్రి స్టార్టప్స్) , సహజ వ్యవసాయం నుండి ఫార్మ్‌స్టే వరకు, పొలాన్నుంచి టేబుల్ మీదవరకూ ఆహారాన్ని తీసుకుపోయే దాకా వ్యవసాయం, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారికీకరణను (ఫార్మలైజేషన్) ఆయన తన ప్రసంగంలో పేర్కొన్నారు.

# మాలమహానాడు ఆధ్వర్యంలో ఖమ్మం కలెక్టరేట్ ఎదుటధర్నా

- ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాటసమితి ఆధ్వర్యం లో కలెక్టరేట్ ముట్టడి
- తెలంగాణ మాలమహానాడు ఖమ్మంజిల్లా కమిటీ

ఖమ్మం, ఆగష్టు 5 :(నేటినిజం ప్రతినిధి): ఎస్సీ వర్గీకరణ తీర్పును పునర్ పరిశీలించాలని కోరుతూ కలెక్టరేట్ ముందు నిరసన ధర్నా



చేయడం జరిగింది. ఈ ధర్నాన్ని ఉద్దేశించి ఖమ్మం జిల్లా తెలంగాణ మాలమహానాడు సంఘానికి చెందిన గుంతెటి వీరభద్రం, లింగాల రవికుమార్, ముడుసు జాకోబ్, గులగట్టు ఎల్లయ్య, చిలకబత్తిని కనకయ్య, దామళ్ల సత్యం ఆధ్వర్యంలో నిన్న సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పును రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో లేదని గతంలో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అదే సుప్రీంకోర్టు 2004లో ఇచ్చిన తీర్పును కాదని ఈరోజు రాష్ట్రాలకు ఎస్సీ, ఎస్టీ ఏబిసిడిల వర్గీకరణ చేసుకోవచ్చని తీర్పునిచ్చింది. ఇట్టి తీర్పు రెండు నాలుకుల ధోరణిగా ఉందని అధికార వర్గానికి అండగా ఇచ్చిన తీర్పులుగా ఉంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కి భంగం కలిగించే విధంగా ఈ తీర్పు ఉంది. ఆది కాలములో విడి విడిగా ఉన్న ఎస్సీ కులాలను చదువుకు, నీటికి, బడికి అంటరానితనం పేరుతో ఊరికి బయట నివసించే ఈ జాతులను సమిష్టిగా ఉండేందుకు షెడ్యూల్ క్యాస్ట్ పేరుతో ఒక దగ్గరకు తీసుకువచ్చి భారత రాజ్యాంగంలో పొందుపరిచారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అలాగే ఎస్టిలైన ఆదివాసులను పై విధముగానే నివసిస్తున్న వారిని ఆర్టికల్ 342 ప్రకారం సమిష్టిగా జీవించేటట్లు ఏర్పాటు జరిగింది. కాబట్టి భారత రాజ్యాంగంలో పొందుపరిచిన ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు ఏబిసిడిలుగా వర్గీకరించే హక్కు ఒక పార్లమెంటుకు తప్ప సుప్రీం కోర్టుకు లేదని మనవి చేస్తు జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నా చేయడం జరిగింది. ఎలాంటి కులగనన జరగకుండానే వర్గీకరణ చేస్తానని బాధ్యతారహితంగా మాట్లాడుతున్న ముఖ్యమంత్రి తన మాట వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరుతున్నాం. ఈ విషయం ప్రభుత్వ దృష్టికి తీసుకుపోవాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు కొరివి దయానంద్, ఖమ్మం జిల్లా అధ్యక్షుడు కొట్టే సుధాకర్, ప్రధాన కార్యదర్శి గుమ్మడి కనకరాజు, ఉపాధ్యక్షుడు గాదరి బాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ దాసరి శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి జమ్మి వీరబాబు, ఎర్ర గంగాధర్, ఖమ్మం నగర వర్కింగ్ ప్రెసిడెంట్ పేర మల్లయ్య, ఉపాధ్యక్షుడు తలారి రాధాకృష్ణ, కరాటే వేణు, చిరంజీవి, బిందె రమేష్, బండ్ల నిర్మల, జ్యోతి, నగర అధ్యక్షుడు తురక నాగేశ్వరరావు, దారా సంజీవరావు, బి.అరుణ, చింతల రవి, నీరుడు రాంబాబు, కల్లూరు శ్రీనివాస్, ఊళ్లోజు ఉదయ్, మీడియా ప్రతినిధులు గుర్రం మనోజ్, పాగా యోనాలతో పాటు జిల్లా కమిటీ సభ్యులందరూ పాల్గొన్నారు.

# మహిళను హింసించిన కేసులో డీఐతో సహా ఆరుగురు సస్పెన్షన్

హైదరాబాద్, ఆగష్టు 5 :షాద్ నగర్ పట్టణ పోలీస్ స్టేషన్ లో సునీత అనే దళిత మహిళను హింసించిన కేసులో ఉన్నతాధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. షాద్ నగర్ డిటెక్టివ్ ఇన్ స్పెక్టర్ (డీఐ) రామిరెడ్డితో పాటు మరో ఐదుగురు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు.

ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ అవినాశ్ మహంతి ఉత్తర్వులు జారీ చేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన ఏసీపీ రంగస్వామి తన నివేదికను సీపీకి సమర్పించారు. నివేదిక ఆధారంగా బాధ్యులను గుర్తించి వారిని సస్పెండ్ చేసినట్లు సీపీ వెల్లడించారు.

షాద్ నగర్ దళితవాడలో నివసించే నాగేందర్ తన ఇంట్లో 22.5 తులాల బంగారం, రూ.2 లక్షల నగదు చోరీ అయ్యాయంటూ జులై 24న పట్టణ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆయన ఎదురింట్లో భీమయ్య, సునీత (35) దంపతులు నివసిస్తున్నారు.

కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న ఈ దంపతులపై అనుమానంతో డీఐ రామిరెడ్డి 26వ తేదీన పోలీస్ స్టేషన్ కు పిలిపించారు. తాము చోరీ చేయలేదని వారు చెప్పడంతో ఇంటికి పంపేశారు. 30వ తేదీ రాత్రి 8.30 గంటల సమయంలో పోలీసులు మళ్లీ వచ్చి.. రాణాకు తీసుకొచ్చి తీవ్రంగా కొట్టారని బాధిత మహిళ సునీత ఆరోపించారు.

# బీఆర్ఎస్(బీఆర్టియు)నుండి ఐఎన్ టీయూసీలోకి భారీ చేరికలు

ఖమ్మం, ఆగష్టు 5 :(నేటినిజం ప్రతినిధి): స్థానిక ఖమ్మం జిల్లా కాంగ్రెస్ ఆఫీస్ సంజీవరెడ్డి భవనంలో సోమవారం నాడు ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షులు కొత్త సీతారాములు అధ్వర్యంలో నగర అధ్యక్షులు నరాల నరేష్, మోహన్ నాయుడు అధ్యక్షతన బిఆర్టియు ఆటో యూనియన్ నుండి భారీచేరికలు, బిఆర్టియు రాష్ట్ర అధ్యక్షులు పాల్వంచ కృష్ణ, బీఆర్టియు జిల్లా, నగర కమిటీ సభ్యులు ఉమా మహేష్, వేమా సెల్వరాజ్, దుర్గా ప్రసాద్ గుప్తా, ఎస్కే.జానీ, మేసా అంజనేయులు, ఎస్కే.సలీం, అబ్దుల్లా, ముల్లర్, ఖాదర్, సురేష్, మధు, తదితరులు ఐఎన్టియుసీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు గా కార్పొరేటర్లు కమర్తపు మురళి, మిక్కిలినేని నరేంద్రచౌదరి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐ ఎన్ టి యు సి అని ఖమ్మం జిల్లాలో బలోపేతం చేయాలని ప్రతి ఆటో కార్మికుడికి మరియు ఖమ్మం జిల్లాలో ఉన్న ప్రతి ఆఫీసులో కార్మికుడికి సహాయ సహకారాలు ఇవ్వాలని అందరూ కలిసికట్టుగా ఏ విభేదాలు లేకుండా ఏకతాటిపై ముందుకు నడవాలని ఈ సందర్భంగా వక్తలు అన్నారు. అనంతరం ఖమ్మంలోని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంప్ ఆఫీసులో పొంగులేటి దయాకర్ రెడ్డిని కలిసి ఈ సందర్భంగా వారికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఎండి.పాషా, నగర ఉపాధ్యక్షులు ఫజల్, సెక్రెటరీ గజ్జి సూరిబాబు, పోతగాని రమణ, నాగరాజు, ఉమారావు, కలిమేళ భద్రం తదితరులు పాల్గొన్నారు.

# ఐడీసీఎంఎస్ చైర్మన్‌గా తారాచంద్..

-అధికార పార్టీ నుంచి ఇద్దరు నామినేషన్ దాఖలు..

-ఒకరి విడ్రాతో ఏకగ్రీవమైన తారాచంద్..



నిజామాబాద్, ఆగష్టు 5 :ఇందూరు ఉమ్మడి జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ (ఐడీసీఎంఎస్) చైర్మన్ గా తారాచంద్ నాయక్ ఏకగ్రీవ మయ్యాడు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇందూరు ఉమ్మడి జిల్లా కో ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ చైర్మన్ గా ఉన్న సాంబారు మోహన్ తన పదవికి రాజీమానా చేశారు. ఆ తర్వాత ఇన్చార్జి చైర్మన్ గా ఇంద్రసేనారెడ్డి వ్యవహరిస్తున్నారు. ఈ క్రమంలో చైర్మన్ పదవి కోసం ఎన్నికలు నిర్వహించారు. సోమవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో స్టేట్ కోఆపరేటివ్ ఎలక్షన్ అథారిటీ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారిగా కామారెడ్డి జిల్లా రిజిస్ట్రార్ రామ్మోహన్ ఆధ్వర్యంలో ఎన్నిక నిర్వహించారు.

ఈ సందర్భంగా చైర్మన్ పదవికి అధికార పార్టీకి చెందిన గాంధారి సొసైటీ చైర్మన్ సాయన్న, రాంపూర్ సొసైటీ చైర్మన్ తారా చంద్ నాయక్ లు ఇద్దరూ నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ పీఠం కోసం సొసైటీ కార్యాలయం వద్ద ఎన్నిక రసవత్తరంగా మారింది. ఎట్టకేలకు గాంధారి సాయన్న నామినేషన్ విడ్రా చేయడంతో తారాచంద్ నాయక్ ను సొసైటీ చైర్మన్ గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి తారాచంద్ నాయక్ నియామక పత్రాన్ని అందజేశారు. తారాచంద్ అనుచర వర్గం మిఠాయిలు పంచుతూ ఘనంగా సంబురాలు జరిపారు.

### అవినీతి అక్రమాలకు తావు లేకుండా సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తా- తారాచంద్ నాయక్

ఎలాంటి అవినీతి, అక్రమాలకు తావు లేకుండా సొసైటీ అభివృద్ధికి కృషి చేస్తానని ఏకగ్రీవంగా ఎన్నికైన తారాచంద్ నాయక్ తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పజెప్పిన కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు యాదగిరి, సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# టిజివో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా డా. కె. రామారావు

- సెక్రెటరీ నోరి శ్రీనేష్ కుమార్ ఏకగ్రీవ ఎన్నిక

హైదరాబాద్, ఆగష్టు 5 :టిజివో రంగారెడ్డి జిల్లా బ్రాంచీకి



అధ్యక్షుడిగా డా. కె. రామారావు,సెక్రెటరీ నోరి శ్రీనేష్ కుమార్ ఏకగ్రీవ ఎన్నికైనారు. రంగారెడ్డి జిల్లాలోని 27 మండలాలో ఉన్న మొత్తం 75 ప్రభుత్వ వివిధ డిపార్ట్మెంట్స్ చెందిన శాఖలకు సంబంధించి మొత్తం 1470 గెజిటెడ్ అధికారులు, ప్రాదమిక సభ్యులుగా ఉండగా అందులో 1113 మెంబర్స్ ను ప్రాధమిక సభ్యత్వం నమోదు చేయడం జరిగింది.. ఈరోజు రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం లో రంగారెడ్డి జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీఓ) ఆఫీస్ బేరర్లకు ఎలక్షన్స్ నిర్వహించడం జరిగింది. తదనుగుణంగా ప్రతి పోస్ట్ కు ఒక్కరు నామినేషన్ చేయడం జరిగింది, కావున కార్యవర్గం మొత్తాన్ని ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ఎలక్షన్ ఆఫీసర్ ప్రకటించారు.

ఇట్టి ఎన్నికల్లో అధ్యకుడిగా డా. కె. రామా రావు, అసోసియేట్ ప్రెసిడెంట్ గా వెంకటేశ్ ,, అసోసియేట్ ప్రెసిడెంట్ గా పి సి వెంకటేశం, వైస్ ప్రెసిడెంట్లు గా ఎన్. వెంకటేశ్వర్లు, ఎమ్. అలివేలు మంగ మరియు విమెన్ వైస్ ప్రెసిడెంట్ గా ఎన్. రేవతి దేదీప్య, సెక్రటరీ గా శ్రీనేష్ కుమార్ నేరి, జాయింట్ సెక్రెటరీలు గా కె. అనిత, పి. లక్ష్మణ స్వామి మరియు విమెన్ జాయింట్ సెక్రెటరీ గా జి. మహేశ్వరి, ట్రెజరర్ ఎన్. శ్రీనివాసులు, ఆర్గనైజేషన్ సెక్రెటరీ గా డా. పి. యుగంధర్ రెడ్డి, పబ్లిసిటీ సెక్రెటరీ ఎల్. రవీందర్, ఆఫీస్ సెక్రెటరీ గా డి. సుజాత, కల్చరల్ సెక్రటరీ గా ఎ. వెంకటేశ్వర్లు, స్పోర్ట్స్ ఎగేమ్స్ సెక్రెటరీ గా ఓ. శివ కుమార్, ఈసి మెంబర్స్ గా డా. కె. నరెందర్, వి. శ్రవణ్ కుమార్, ఏ. నరెందర్ గౌడ్ మరియు బి. సుజాత ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర టిజిఓ అధ్యక్షులు ఏలూరి శ్రీనివాస రావు, సెక్రెటరీ ఏనుగుల సత్య నారాయణ అసోసియేట్ ప్రెసిడెంట్ శ్యామ్, ట్రెజరర్ ఉపేందర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ జగన్ మోహన్ రావు, జాయింట్ సెక్రెటరీ పరమేశ్వర్ రెడ్డి, లేడి రెప్రజెంటేటివ్ దీప రెడ్డి, ఈసి మెంబర్ యాదగిరి పాల్గొని ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు..

# బఫర్ జోన్‌లో హోటళ్ళు/రిసార్టుల నిర్మాణం

న్యూఢిల్లీ, ఆగష్టు 5 :పర్యావరణ పరంగా సున్నితమైన మండలం (ఇఎస్‌జడ్) పరిధిలో ఏ ప్రయోజనానికైనా సరే, ఎలాంటి కొత్త శాశ్వత నిర్మాణానికి అయినా అనుమతిని ఇవ్వడం జరగదు అని 2022 జూన్ 3 నాటి ఉత్తర్వులో సుప్రీం కోర్టు ఆదేశాలు పేర్కొంటున్నాయి. ప్రస్తావిత ఉత్తర్వులతో పాటు 2023 ఏప్రిల్ 26నాటి ఆదేశాల్లోను కోర్ట్ స్పష్టతను ఇచ్చింది. తదనుగుణంగా మార్గదర్శకాలను తూచా తప్పక పాటించాలన్న షరతును అనుసరించి కార్యకలాపాలకు అనుమతిని ఇస్తున్నట్లు మంత్రిత్వ శాఖ పేర్కొంది.

సుప్రీంకోర్టు ఉత్తర్వులతో పాటు మంత్రిత్వ శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను ఎకో-సెన్సిటివ్ జోన్స్ (ఈఎన్‌జడ్ లు) సహా అటవీ ప్రాంతాల పరిరక్షణ మరియు నిర్వహణ కోసం రాష్ట్రాలు/కేంద్ర పాలిత ప్రాంతాలు తప్పక పాటించవలసి ఉంటుంది.

ఈ సమాచారాన్ని పర్యావరణం, అడవులు-వాతావరణ మార్పు శాఖ సహాయ మంత్రి శ్రీ కీర్తి వర్ధన్ సింగ్ లోక్ సభకు ఈ రోజు ఇచ్చిన ఒక లిఖిత పూర్వక సమాధానంలో తెలియజేశారు.

# యువ కళాకారులకు ఉపకార వేతనాలు

న్యూఢిల్లీ, ఆగష్టు 5 :యువ కళాకారులకు సహకారం అందించేందుకు సాంస్కృతిక మంత్రిత్వ శాఖ 'వివిధ సాంస్కృతిక రంగాల్లోని యువ కళాకారులకు ఉపకార వేతనాల పథకం(స్కాలర్‌షిప్స్ టు యంగ్ ఆర్టిస్ట్స్ ఇన్ డిఫెరెంట్ కల్చరల్ ఫీల్డ్స్)(ఎస్‌వైఏ)' పేరుతో ఆర్థిక చేయుతను అందించే పథకాన్ని అమలు చేస్తోంది. సాంస్కృతిక నృత్యరూపకాలు, దేశీయ కళాకృతులు, ఇతర సంప్రదాయ కళారూపాలలో ప్రావీణ్యం పొందేందుకు ఆయా రంగాల్లో మరింత అధునాతన శిక్షణ పొందడానికి సహకరించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం కింద గరిష్టంగా 400 మంది విద్యార్థులకు నెలకు రూ.5,000 చొప్పున రెండేళ్ల కాలానికి గానూ ఆరు నెలలకు ఒక వాయిదా చొప్పున నాలుగు వాయిదాల్లో చెల్లిస్తోంది.

18 నుంచి 25 ఏళ్ల మధ్య వయస్సు ఉండి, ఎవరైనా గురువు లేదా సంస్థలో కనీసం 5 ఏళ్ల పాటు శిక్షణ పొందుతున్న విద్యార్థులను ఇందుకోసం ఎంపిక చేస్తుంది.

మంత్రిత్వ శాఖ ఏర్పాటుచేసే నిపుణుల కమిటీ ముందు వ్యక్తిత్వ పరీక్షలో కనబర్చిన ప్రతిభ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేస్తారు.

ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా గత ఐదేళ్లలో 'వివిధ సాంస్కృతిక రంగాల్లోని యువ కళాకారులకు ఉపకార వేతనాల పథకం' కింద ఎంపికైన లబ్ధిదారుల మొత్తం సంఖ్యకు సంబంధించి రాష్ట్రాలవారీగా వివరాలు అనుబంధం-1లో ఉన్నాయి.

దీంతో పాటు వివిధ సాంస్కృతిక రంగాల్లోని యువ కళాకారులకు ఉపకార వేతనాలు అందించేందుకు 'కళలు, సాంస్కృతిక ప్రోత్సాహం కోసం ఉపకార వేతనాలు, ఫెలోషిప్ అందించే పథకం(స్కీమ్ ఫర్ స్కాలర్‌షిప్ ఆండ్ ఫెలోషిప్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఆర్ట్ ఆండ్ కల్చర్)' పేరుతో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ మరో కేంద్ర పథకాన్ని సైతం అమలు చేస్తోంది. 'కళలు, సంస్కృతి ప్రోత్సాహం కోసం ఉపకార వేతనాలు, ఫెలోషిప్ అందించే పథకం' అమలుకు కేటాయించిన నిధులను రాష్ట్రాలవారీగా మంజూరు చేయడం ఉండదు. ఈ పథకానికి గత ఐదేళ్లలో మంజూరైన నిధుల వివరాలు కింద ఉన్నాయి:-

వివిధ సాంస్కృతిక రంగాల్లోని యువ కళాకారులకు ఉపకార వేతనాలు అందించే పథకం(స్కీమ్ ఆఫ్ స్కాలర్‌షిప్స్ టు యంగ్ ఆర్టిస్ట్స్ ఇన్ డిఫెరెంట్ కల్చరల్ ఫీల్డ్స్) కింద గత ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్ సహా దేశవ్యాప్తంగా వినియోగించిన నిధుల వివరాలు రాష్ట్రాలవారీగా అనుబంధం-2లో ఉన్నాయి.

# గ్రీనరీ పెంపు లక్ష్యంగా స్వచ్ఛదనం - పచ్చదనం.. కలెక్టర్




కరీంనగర్, ఆగష్టు 5 : పారిశుద్ధ్య నిర్వహణ, గ్రీనరీ పెంపు లక్ష్యంగా ప్రభుత్వం స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించిందని పెద్దపల్లి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జూనియర్ కళాశాల మైదానంలో స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్దపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి అమర్ నగర్ చౌరస్తా, మసీదు, జెండా, సివిల్ ఆసుపత్రి మీదుగా ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు అవగాహన ర్యాలీలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి పాల్గొన్నారు.

అనంతరం మాట్లాడుతూ పారిశుద్ధ్య నిర్వహణ గ్రీనరీ పెంపు లక్ష్యాలతో ప్రభుత్వం ఆగస్టు 5 నుంచి 9 వరకు స్వచ్ఛదనం- పచ్చదనం కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రవంలో ప్రజలను పెద్ద ఎత్తున భాగస్వామ్యం చేయాలనే లక్ష్యంతో ముందస్తుగా ర్యాలీ చేపట్టామని తెలిపారు. స్వచ్ఛదనం -పచ్చదనం ర్యాలీలో వివిధ పాఠశాల విద్యార్థులు, కళాకారులు, మెప్మా మహిళా సంఘాల పెద్ద ఎత్తున పాల్గొన్నాయని, వీరు ఇంటికి వెళ్లిన తరువాత ఆ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీరు నిల్వ ఉండకుండా చూడాలని, గ్రీనరీ పెంచే దిశగా మొక్కలు నాటి వాటిని పూర్తి స్థాయిలో సంరక్షించాలన్నారు.

నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం స్వచ్ఛదనం -పచ్చదనం కార్యక్రమాలను ప్రతిరోజూ పక్కాగా నిర్వహించి రాష్ట్రంలోనే పెద్దపల్లి జిల్లాను ప్రథమ స్థానంలో ఉండే విధంగా కృషి చేయాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో తగ్గించాలన్నారు. అనంతరం వ్యాస రచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు అదనపు కలెక్టర్ అరుణశ్రీ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, ప్రజా ప్రతినిధులు, అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశైల మల్లికార్జున క్షేత్రానికి శ్రావణ శోభ.. భక్తులతో కిక్కిరిసిన శ్రీగిరులు..

శ్రీశైలం, ఆగష్టు 5 : ప్రముఖ ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం, అష్టాదశ శక్తిపీఠమైన శ్రీశైలం దేవస్థానంలో శ్రావణమాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ఉదయం 3 గంటలకు మల్లికార్జున స్వామి, భ్రమరాంబ అమ్మవార్ల ఆలయ ద్వారాలు తెరిచి.. ప్రాతఃకాల పూజలు నిర్వహించారు. 4.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలకు అనుమతించారు. భక్తులు వేకువజాము నుంచే భక్తులు పాతాళగంగలో స్నానాలు చేసి స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం బారులు తీరారు. సాయంత్రం కాలం వరకు భక్తులు దర్శనాలు చేసుకున్నారు. నాలుగు వరుసల క్యూలైన్లలో భక్తులకు దర్శనాలు కల్పించారు. క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, బిస్కెట్స్, అల్పహారం అందించారు.

భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకొని గర్భాలయ అభిషేకాలు, సామూహిక అభిషేకాలు, ఆర్జిత కుంకుమార్చలను నిలిపివేశారు.

భక్తుల రద్దీకి అనుగుణంగా సిబ్బంది ఏర్పాట్లు చేశారు. మరో వైపు ఉదయం 10.30 గంటల నుంచి భక్తులకు అన్నప్రసాద వితరణ భవనంలో అన్నదానం చేశారు. అలాగే, రాత్రి 7 గంటల నుంచి అల్పహారం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఆలయానికి వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలన్నీ కిక్కిరిసిపోయాయి.

### శివచతుస్సప్తాహ భజనలు

శ్రావణ మాసం సందర్భంగా ఆలయంలో శివచతుస్సప్తాహ భజనలు ప్రారంభమయ్యాయి. సోమవారం ప్రారంభమైన ఈ భజన కార్యక్రమాలు రేయింబవళ్లు నిరంతరాయంగా కొనసాగనున్నాయి. పవిత్ర అఖండ భజనలు శ్రావణమాస ప్రారంభం సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని వీరశిరోమండపంలో ప్రారంభించగా.. ఈవో పెద్దిరాజు, అర్చకులు పాల్గొన్నారు. ముందుగా వేదపండితులు లోక కల్యాణాన్ని కాంక్షిస్తూ సంకల్పం పఠించారు. అనంతరం కార్యక్రమం విజయవంతంగా సాగాలని మహాగణపతిపూజ జరిపించారు. అనంతరం శాస్త్రోక్తంగా చండీశ్వరస్వామి వారికి విశేషపూజలు నిర్వహించి.. శివప్రణవ పంచాక్షరీనామ భజనను మొదలుపెట్టారు.

ఏపీలోని కర్నూలుకు చెందిన అయిదు భజన బృందాలు, కర్ణాటకకు చెందిన మూడు భజన బృందాలకు ఈ శ్రావణమాస శివభజనలు చేసేందుకు అవకాశం కల్పించారు. ఎనిమిది బృందాలు విడతలవారీగా భజన కార్యక్రమాలు కొనసాగించనున్నారు.

# చిన్నారిని ఆశీర్వదించిన తుంబూరు దయాకర్ రెడ్డి, డా.కోట రాంబాబు



ఖమ్మం, ఆగష్టు 5 :(నేటినిజం ప్రతినిధి): మధిర మండలంలోని అంబారుపేట గ్రామంలో పొంగులేటి సైన్యం అక్కినపల్లి నాగేశ్వరావు కుమార్తె నూతన వస్త్రాలంకరణ వేడుకకు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంప్ కార్యాలయం ఇంఛార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు డా.కోట రాంబాబు హాజరై చిన్నారిని ఆశీర్వదించి నూతన వస్త్రాలను కానుకగా అందించారు.

ఈ కార్యక్రమంలో యన్నం కోటేశ్వరరావు, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, కటికల సీతారామి రెడ్డి, యర్రగుంట రమేష్, శీలం వెంకట్రామి రెడ్డి, బుర్రా వెంకట నారాయణ, చిలకా సత్య నారాయణ, శీలం తిరుమలరావు, బత్తినేని నాగభూషణరావు తదితరులున్నారు.

# హరిత భారత్ కార్యక్రమం

న్యూఢిల్లీ, ఆగష్టు 5 :వాతావరణ మార్పులపై జాతీయ కార్యచరణ ప్రణాళిక కింద చేపట్టిన ఎనిమిది కార్యక్రమాల్లో హరిత భారత్ కోసం జాతీయ కార్యక్రమం(నేషనల్ మిషన్ ఫర్ ఏ గ్రీన్ ఇండియా )(జీఐఎం) ఒకటి. భారతదేశ అటవీ విస్తీర్ణాన్ని పరిరక్షించడం, పునరుద్ధరించడంతో పాటు పెంపొందించడం ఈ కార్యక్రమ లక్ష్యం. సంయుక్త అటవీ నిర్వహణ కమిటీల(జేఎఫ్ఎంసీ) ద్వారా అటవీ, అటవీయేతర ప్రాంతాల్లో పర్యావరణ పునరుద్ధరణ చర్యలు చేపట్టడం ద్వారా వాతావరణ మార్పులను నియంత్రించడం ఈ కార్యక్రమ ఉద్దేశం. జీఐఎం కింద 2015-16 ఆర్థిక సంవత్సరంలో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఇప్పటివరకు 155130 హెక్టార్ల విస్తీర్ణంలో మొక్కలు నాటడానికి/పర్యావరణ పునరుద్ధరణకు గానూ 17 రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతానికి రూ.909.82 కోట్లు విడుదలయ్యాయి.

ఈ సమాచారాన్ని పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ సహాయమంత్రి శ్రీ కీర్తివర్ధన్ సింగ్ లోక్‌సభలో సోమవారం రాతపూర్వకంగా తెలియజేశారు.


వురిమళ్ల ఫౌండేషన్ ఖమ్మం.

VURIMALLA FOUNDATION REGD. NO 228 OF 2019

బాలలకు, యువతకు సువర్ణ అవకాశం!

మినీ నవలల పోటీ - 2024

పాఠశాల స్థాయి నుండి కళాశాల స్థాయి (ఇంటర్, డిగ్రీ) వరకు

అంశం : ఏదైనా సామాజిక, పర్యావరణ పరిరక్షణ శాస్త్రీయ, మానవీయ సంబంధాలు

- 30 పేజీలకు తగ్గకుండా రాసే నవలలకే ప్రాధాన్యత.
- ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటుగా రెండు కన్సోలేషన్ బహుమతులు.
- మీ నవలలను పోస్ట్ లేదా కొరియర్ ద్వారా మాత్రమే పంపించాలి.

నవలలు పంపుటకు ఆఖరి తేది : సెప్టెంబర్ 30, 2024

నవలలు పంపవలసిన చిరునామా :
ఇ.నెం. 11-10-694/5, బురహాన్‌పురం,
ఖమ్మం - 507001.
సెల్ : 9494773969

# తెలంగాణకూ ఆయువుపట్టు మీరే -రండి జన్మ భూమి రుణం తీర్చుకోండి



హైదరాబాద్, ఆగష్టు 5 : న్యూజెర్సీ రాష్ట్రానికి అత్యధిక పెట్టుబడులు తీసుకురావడంలో భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి అమెరికాలోని తెలుగు రాష్ట్రాల ప్రవాసులకు పిలుపునిచ్చారు. న్యూజెర్సీలో ఆదివారం జరిగిన ప్రవాసుల ఆత్మీయ సమ్మేళానికి వేలాది మంది తరలివచ్చారు. ఈ సందర్భంగా దారిపొడవునా భారీ ర్యాలీతో ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ''తెలంగాణ మీ జన్మభూమి, మీ దేశంలో మీరు పెట్టిన ప్రతి పెట్టుబడికి తప్పకుండా ప్రయోజనం ఉంటుంది. అంతకు మించిన అత్యుత్తమ ప్రతిఫలం ఉంటుంది. మన ప్రాంత అభివృద్ధిలో భాగస్వామ్యం పంచుకుంటే అంతకు మించిన సంతృప్తి బోనస్ గా లభిస్తుంది..' అని ఎన్నారైలలో ఉత్సాహం నింపారు.

''గత సంవత్సరం టీపీసీసీ అధ్యక్షుని హోదాలో అమెరికాకు వచ్చాను. పదేండ్ల పాటు సాగిన దుష్పరిపాలనకు, విధ్వంసాలకు విముక్తి పలికి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతే మళ్లీ వస్తానని చెప్పాను. నేను ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాను" అన్నారు.

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని తమ ప్రభుత్వం నిలబెట్టుకుంటుందని ముఖ్యమంత్రి పునరుద్ఘాటించారు. ఇప్పటికే రైతులు, మహిళలు, యువకుల సంక్షేమం, అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. రైతులకు ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీతో పాటు, ఇన్ పుట్ సబ్సిడీగా రైతు భరోసా, నిరుద్యోగులకు ఉద్యోగాలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500కు వంట గ్యాస్ సిలిండర్, నిరుపేదలకు 200 యూనిట్ల ఉచిత గృహ విద్యుత్తు, ఉపాధ్యాయులకు పదోన్నతులు, విద్యార్థులకు నాణ్యమైన విద్య పథకాలను అమలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ఇది ప్రారంభం మాత్రమే అని.. భవిష్యత్తు ప్రణాళికలతో తమ ప్రభుత్వం ముందుకు వెళుతుందన్నారు. తమ పరిపాలనపై ఎలాంటి అపోహలు, ఆందోళనలకు తావు లేదని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని సమ్మిళిత ఆర్థిక వృద్ధిని వేగంగా సాధించే తమ ప్రభుత్వం కొత్త పారిశ్రామిక విధానాన్ని తీసుకు వస్తుందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

నిధుల సమీకరణతో పాటు ఎక్కువ మందికి ఉపాధి కల్పన, నైపుణ్యాల వృద్ధికి అందులో సమానమైన ప్రాధాన్యమిస్తామని చెప్పారు.

'ఎన్నికల ముందు మాపై ఎంతో విష ప్రచారం జరిగింది.. గిట్టని వాళ్లందరూ అసలు కాంగ్రెస్ అధికారంలోకి రాదని అన్నారు. వచ్చినా అది ఉండనే ఉండదన్నారు. ఇప్పుడు రాష్ట్రంలో అభివృద్ధి మందగిస్తుందంటూ లేని పోని అపోహలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే వాళ్లకు తగిన బుద్ధి చెప్పాం. అబద్ధాలకోరుల మాటలు తప్పని మరోసారి నిరూపిస్తాం. హైదరాబాద్‌ను భారతదేశంలోనే కాదు.. ప్రపంచంలోనే అగ్రగామి నగరంగా అభివృద్ధి చేసేందుకు పోటీ పడతాం?' అని సీఎం ప్రకటించారు.

మీ నైపుణ్యాలు, మీ ప్రతిభా పాటవాలతో అమెరికాను పటిష్టంగా, సంపన్నంగా మార్చారని ప్రవాసులను ముఖ్యమంత్రి అభినందించారు. ఇకపై తెలంగాణకు మీ సేవలు అందించాలని స్వాగతించారు.

తెలంగాణలో మెట్రో కోర్ అర్బన్ తో పాటు , సెమీ అర్బన్, రూరల్ క్లస్టర్లుగా విభజించి పెట్టుబడులకు ప్రత్యేకమైన వ్యవస్థలను రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ సందర్భంగా అమెరికాలోని ఈస్ట్ కోస్ట్ ఇండియన్ కమ్యూనిటీకి చెందిన పలువురు ముఖ్యులతో సీఎం మాట్లాడుతూ, హైదరాబాద్, సికింద్రాబాద్, సైబరాబాద్ తరహాలో నాలుగో నగరంగా ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ప్రపంచ స్థాయి మాస్టర్ ప్లాన్ తో హైదరాబాద్ ను అత్యున్నత స్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు.

హైదరాబాద్ ను అభివృద్ధి చేసేందుకు మీరందరూ కలిసి రావాలని ప్రవాసులకు సీఎం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలు, వాగ్దానాలను నెరవేర్చేందుకు రేవంత్ రెడ్డి చేస్తున్న కృషిని ఎన్నారైలు అభినందించారు.

హైదరాబాద్ అభివృద్ధికి చేపడుతున్న కార్యక్రమాలను, భవిష్యత్తు ప్రణాళికలను అందరూ ప్రశంసించారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలనే ప్రచారంలో ప్రభుత్వంతో కలిసి పాల్గొంటామని హామీ ఇచ్చారు. అంతకుముందు తెలంగాణ సంస్కృతిని చాటిచెప్పే పాటలు, నృత్యాలతో కూడిన భారీ ప్రదర్శనను చిన్నారులు ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన ఓవర్సీస్ కాంగ్రెస్ పార్టీ అమెరికా అధ్యక్షుడు మొహిందర్ సింగ్ గిల్జియాన్ మాట్లాడుతూ.. 'మిమ్మల్ని ముఖ్యమంత్రిగా చూడాలన్న మా కోరిక నెరవేరింది. ఇప్పుడు రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేయడానికి మనమందరం కష్టపడాలి?' అన్నారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, వ్యాక్సిన్‌లు, హెల్త్‌కేర్, ఆర్టిఫిషియల్ రంగాల్లో తెలంగాణ బలమైన స్థావరంగా ఎదగాలని ఆకాంక్షించారు.

# విధుల్లో ఉన్న రైల్వే పోలీసులకు.. ట్రావెల్ అథారిటీ లేదా టికెట్ తప్పనిసరి: రైల్వే

అహ్మదాబాద్, ఆగష్టు 5 : విధుల్లో ఉన్న ప్రభుత్వ రైల్వే పోలీస్ (జీఆర్పీ), రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్పీఎఫ్) సిబ్బందికి తప్పనిసరిగా ట్రావెల్ అథారిటీ లేదా రైలు ప్రయాణానికి టికెట్ కొనుగోలు చేయాలని రైల్వే స్పష్టం చేసింది. కేవలం ఐడీ కార్డు మాత్రమే ఉంటే సరిపోదని పేర్కొంది. అధికారిక విధుల్లో ఉండగా ప్రమాదం జరిగినందున పరిహారం కోరుతూ రైల్వే కానిస్టేబుల్ దాఖలు చేసిన పిటిషన్‌ను రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్ తోసిపుచ్చింది. అలాగే సిబ్బందికి డ్యూటీ కార్డ్ పాస్‌లను జారీ చేయడంలో రైల్వే నిర్లక్ష్యంపై మండిపడింది.

2019 నవంబర్ 13న జీఆర్పీ కానిస్టేబుల్ రాజేష్ బగుల్ అధికారిక విధుల కోసం గుజరాత్‌లోని సూరత్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు వెళ్లాడు. సూరత్-జామ్‌నగర్ ఇంటర్‌సిటీ రైలులో బరూచ్‌కి తిరిగి వస్తుండగా పాలేజ్ స్టేషన్‌లో పడిపోయాడు. ఎడమ కాలుకు తీవ్ర గాయం కావడంతో మోకాలి పైభాగం వరకు తొలగించారు.

దీంతో రైల్వే విధుల్లో ఉన్న తాను ప్రమాదానికి గురయై కాలు కోల్పోయానని, వడ్డీతో సహా రూ.8 లక్షలు నష్ట పరిహారం ఇవ్వాలని రైల్వేను రాజేష్ డిమాండ్ చేశాడు. దీని కోసం రైల్వే క్లెయిమ్స్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించాడు.

కాగా, దిగాలనుకున్న స్టేషన్‌ను దాటిన తర్వాత రైలు దిగేందుకు రాజేష్ ప్రయత్నించడంతో పడిపోయి ఉండవచ్చని రైల్వే వాదించింది. అలాగే రైలులో అధికారిక ప్రయాణాన్ని నిరూపించడంలో అతడు విఫలమయ్యాడని పేర్కొంది. తప్పనిసరిగా ట్రావెల్ అథారిటీ కలిగి ఉండాలని లేదా రైలు ప్రయాణానికి సంబంధించిన టికెట్ కొనుగోలు చేయాలని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో నష్టపరిహారం కోసం అతడు దాఖలు చేసిన పిటిషన్‌ను రైల్వే ట్రిబ్యునల్ కొట్టివేసింది.

# రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.50కోట్లు కేటాయించిన ఘనత కాంగ్రెస్ పార్టీదే

## -పదేండ్లు అధికారంలో ఉన్న బీజేపీ ప్రసాద్ స్కీమ్ లో రాజన్న ఆలయాన్ని చేర్చలేదు



రాజన్న సిరిసిల్ల, ఆగష్టు 5 :(నేటినిజం ప్రతినిధి): ఇటీవల జరిగిన బడ్జెట్ సమావేశాల్లో రాజన్న ఆలయ అభివృద్ధికి మొట్టమొదట సారిగా రూ.50కోట్లు కేటాయించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి, సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందని వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు స్పష్టం చేశారు. రాష్ట్ర బడ్జెట్ లో రాజన్న ఆలయ అభివృద్ధికి నిధులు కేటాయించడం లేదని ఆరోపిస్తూ ఇటీవల బీజేపీ నాయకులు తెలిపిన నిరసన కార్యక్రమాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం వేములవాడ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ వద్ద సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కతో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ల చిత్రపటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ రాజన్న ఆలయ అభివృద్ధి, బడ్జెట్ విషయంలో బిజెపి నాయకులు చేసిన వ్యాఖ్యలన్నీ అర్ధరహితంగా ఉన్నాయని, ఆలయ అభివృద్ధికి చరిత్రలోనే ఎన్నడు లేని విధంగా రూ. 50 కోట్లు నిధులు కేటాయించిన ఘనత కాంగ్రెస్ పార్టీకి సీఎం రేవంత్ రెడ్డికే దక్కిందని అన్నారు. గత పదేండ్లుగా అధికారంలో ఉన్నప్పటికీ రాజన్న ఆలయాన్ని ప్రసాద్ స్కీములో చేర్చకుండా ఆలయ అభివృద్ధిపై వివక్ష చూపింది బీజేపీనేనని మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో, ప్రభుత్వ విప్, స్థానిక శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ సహకారంతోనే రాజన్న ఆలయంతో పాటు వేములవాడ నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని, బిజెపి నాయకులు ఈ విషయాన్ని గమనించి, వారు చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, సాగరం వెంకటస్వామి, కౌన్సిలర్ ఇప్పపుల అజయ్ నాయకులు కూరగాయలకు కొమురయ్య, చిలుక రమేష్, కనికరపు రాకేష్, నాగం కుమార్, పులి రాంబాబు, ముప్పిడి శ్రీనివాస్, గూడూరి మధు, అన్నారం శ్రీనివాస్, సాబీర్, నాగుల రాము, పుల్కం రాజు, పీర్ మహమ్మద్, తోట రాజు అంబాటి చందు, చిలువేరి శ్రీనివాస్, బొజ్జ భారతి, కొక్కుల బాలకృష్ణ, నాగుల విష్ణు, దైత కుమార్, గురువయ్య, బొజ్జ మల్లేశం, గుర్రం తిరుపతి, రాగిరి నాగరాజు, రాజు, వెంకన్న, ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా అల్ఫోర్స్ ఎక్సెల్

## -అలరించిన విద్యార్థుల నృత్య ప్రదర్శనలు



కరీంనగర్, ఆగష్టు 5 :(నేటినిజం ప్రతినిధి) వినోదభరితమైన కార్యక్రమాలతో చాలా ఆనందం కల్గడమే కాకుండా వివిధ కార్యక్రమాలను చేపట్టడం ద్వారా వస్తున్న ఒత్తిడిని జయించవచ్చుని, చక్కటి వాతావరణాన్ని ఏర్పాటు చేయవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా॥వి. నరేందర్ రెడ్డి అన్నారు. స్థానిక ఒక ప్రవేట్ వేడుక మందిరంలో ఆకాశమే హద్దుగా ఎక్సెల్ పేరుతో వైభవంగా నిర్వహించినటువంటి కళాశాల ఫ్రెషర్స్ డే కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకు ముందు వారు చదువుల తల్లి సరస్వతి మాత విగ్రహానికి పూల మాల వేసి సాంప్రదాయబద్ధంగా జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను అట్టహాసంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ

నేడు చాలా మంది యువకులు తీవ్ర ఒత్తిడికి గురవడం చాలా విచాంకరమని ఆందోళన వ్యక్తం చేశారు. చక్కటి ప్రణాళికలతో కార్యక్రమాలతో రూపొందించి లక్ష్యాలను చేరుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు వారి పిల్లిలకు కావల్సిన వనరులను సమకూర్చి వారిని అగ్రశ్రేణిలో నిలుపేందుకు ప్రోత్సాహం అందించి సాధించే దిశగా పయనించాలని సూచించారు. మన దేశం నుండి రాష్ట్ర ప్రతినిధులు అభివృద్ధి ప్రణాళికలను రూపొందిస్తు విద్యార్థులను ఎల్లపుడు ప్రోత్సహిస్తూ వారికి ఉపాధి అవకాశాలను మెరుగు పరుస్తున్నారని చెప్పారు. వివిధ పనులకు ఆకర్షితులై ఉజ్వల భవితన్ను వృదా చేసుకోవద్దని చెప్పారు. చిన్ననాటి నుండే ఉత్తమంగా వ్యవహరించి సమాజానికి ప్రతీకగా ఉండాలని చెప్పారు.

విద్యార్థులు సంచలన విజయాలను నమోదు చేయడం చాలా అభినందనీయమని, మొదటి నుండే ఉత్తమంగా వ్యవహరిస్తు చాలా చక్కటి పేరు ప్రఖ్యాతలను స్వంతం చేసుకోవడం వారి వ్యవహారా శైలికి ఒక గొప్ప నిదర్శనమని అభివర్ణించారు.

గత 35 సం॥లుగా అల్ఫోర్స్ విద్యాసంస్థలు స్ఫూర్తిదాయకంగా ఎటువంటి ఆటంకం లేకుండా కృషి చేస్తున్నదని, విద్యాభివృద్ధికై నూతన ఒరవడిని సృష్టిస్త సమాజంలో వెలుబడుతున్న మార్పులకు అనుగుణంగా, ప్రవేశపెడుతున్న మార్పులను దృష్టిలో పెట్టుకొని ముందుకు సాగడమే కాకుండా సంచలనాత్మక విజయాలను నమోదు చేస్తు నూతన అధ్యాయాలకు భీజం పోస్తున్నదని హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను అన్ని రకాలుగా అభివృద్ధి పరచడమే ప్రధాన లక్ష్యమని చెప్పారు.

వేడుకలలో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటువంటి ఓ మై ఫ్రెండ్, జయ్ సియరామ్ జయ్ జయ్ సియరామ్, గువ్వాగోరింకతో, చలియా చలియా.. నృత్యాలు చాలా అలరించాయి మరియు వివిధ ప్రతిష్మాత్మక విద్యా సంస్థల్లో సీట్లు పొందిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ముఖ్యంగా తల్లిదండ్రుల ఆశయాలను ఎప్పటికప్పుడు సాధిస్తు వారి దృష్టిలో అత్యుత్తమ పిల్లలుగా ఖ్యాతి ఘడించి చక్కటి స్థానంలో ఉండాలని అభిలాషించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్, అధ్యాపకలు, తల్లిదండ్రులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# అపహరణకు గురైన బాలిక ఆచూకీ లభ్యం

## -'సీసీ' ఆధారంగా కేసును ఛేదించిన అబిడ్స్ పోలీసులు
## -నిందితుడి అరెస్టు.. భరోసా సెంటర్‌కు చిన్నారి తరలింపు



హైదరాబాద్, ఆగష్టు 5 :అపహరణకు గురైన చిన్నారిని అబిడ్స్ పోలీసులు రక్షించారు. దుండగుడిని పట్టుకున్న పోలీసులు..వైద్యపరీక్షల కోసం చిన్నారిని భరోసా కేంద్రానికి తరలించారు. ఆదివారం అబిడ్స్ పోలీస్ స్టేషన్‌లో సెంట్రల్ జోన్ డీసీపీ అక్షాంశ్ యాదవ్, ఏసీపీ చంద్రశేఖర్, ఇన్‌స్పెక్టర్‌తో కలిసి కేసు వివరాలను వెల్లడించారు. బేగంబజార్ ఛత్రి ప్రాంతానికి చెందిన ప్రియాంక తన సోదరుడి కూతురు (6)ను తీసుకుని శనివారం మధ్యాహ్నం అబిడ్స్ కట్టెలమండిలో పుట్టింటికి వెళ్లింది.

అక్కడ స్థానిక ముత్యాలమ్మ ఆలయం వద్ద ఆడుకుంటున్న చిన్నారి అపహరణకు గురైంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అబిడ్స్ పోలీసులు రంగంలోకి దిగి.. ఆ ప్రాంతాల్లో సీసీ కెమెరాలను పరిశీలించగా, చిన్నారి గుర్తుతెలియని వ్యక్తి చెయ్యి పట్టుకొని నడుచుకుంటూ వెళ్లి..ఆటో ఎక్కినట్లు గుర్తించారు. ఆటో డ్రైవర్‌ను విచారించగా, అఫ్జల్‌గంజ్ ప్రాంతంలో దింపినట్లు చెప్పాడు. అక్కడ సీసీ కెమెరాలను పరిశీలించారు. జహంగీర్ పీర్ దర్గాకు వెళ్తున్న ఆర్టీసీ బస్సులో నిందితుడు బాలికతో వెళ్లినట్లు గుర్తించారు. ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగి.. గాలింపు చర్యలు చేపట్టాయి. ఆదివారం ఉదయం కొత్తూరు మండలం ఇనుముల నర్వ గ్రామ సమీపంలో బాలికను తీసుకొని వెళున్న వ్యక్తిని పోలీసులు గుర్తించి.. అదుపులోకి తీసుకోవడంతో కిడ్నాప్ కథ సుఖాంతమైంది. నిందితుడు బీహార్‌కు చెందిన మహ్మద్ బిలాల్ అన్సారీ(32)గా గుర్తించారు.

బాలికను కిడ్నాప్ చేసి తల్లిదండ్రుల నుంచి డబ్బుల డిమాండ్ చేయాలని పథకం పన్నినట్లు డీసీపీ అక్షాంశ్ యాదవ్ తెలిపారు. సైకిల్ కొనిస్తానని, డాడీ దగ్గరకు తీసుకెళ్తానంటూ.. చిన్నారిని నమ్మించి.. అపహరించినట్లు చెప్పారు. బిలాల్ అన్సారీపై అనేక కేసులున్నాయని, జైలు శిక్ష కూడా అనుభవించాడని వెల్లడించారు. అలాగే హైదరాబాద్‌కు వచ్చిన తరువాత కొత్తూరు పరిధిలోని ఎనిమిదేండ్ల బాలికను కిడ్నాప్ చేసి లైంగిక దాడికి పాల్పడిన కేసులో బిలాల్ అన్సారీ నిందితుడిగా ఉన్నట్లు చెప్పారు.


సాహిత్యం | సంగీతం



**శ్రీ మానస ఆర్ట్స్, కవన వేదిక,**
**శ్రీ త్యాగరాయ గానసభ ల**
సంయుక్త ఆధ్వర్యంలో



ప్రముఖ కవి
**శ్రీ అడిగోపుల వెంకటరత్నం గారి**
**సంస్మరణ సభ**

తేది : 06-08-2024 మంగళవారం సా॥ 6-00 గం॥లకు
వేదిక : మినీ హాల్, శ్రీ త్యాగరాయ గానసభ,చిక్కడపల్లి, హైదరాబాద్

**అడిగోపుల వెంకటరత్నం వ్యక్తిత్వం-సాహిత్యం-జ్ఞాపకాలు**

ప్రముఖులు :
డా॥ కె. శివారెడ్డి గారు, ప్రసిద్ధ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
శ్రీ నిఖిలేశ్వర్ గారు, ప్రసిద్ధ కవి, కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
శ్రీ కందుకూరి శ్రీరాములు గారు
డా॥ టి. గౌరీ శంకర్ గారు
డా॥ నాళేశ్వరం శంకరం గారు
డా॥ నోరి రాజేశ్వరరావు గారు
శ్రీ పి. శ్రీనివాస గౌడ్ గారు
శ్రీ బైస దేవదాస్ గారు
శ్రీ ఒద్దిరాజు ప్రవీణ్‌కుమార్ గారు
శ్రీ పరమాత్మ గారు
శ్రీ కె. ప్రభాకర్ గారు
డా॥ రాపోలు సుదర్శన్ గారు
వివిధ సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు, తదితరులు...

కళా శారద, ప్రధాన కార్యదర్శి, గానసభ | చీకోలు సుందరయ్య, కార్యదర్శి, కవన వేదిక | రఘుశ్రీ, కార్యదర్శి, మానస


# కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కేవలం 14 మందికే రైతు రుణమాఫీ : ఎమ్మెల్యే వివేకానంద గౌడ్

హైదరాబాద్, ఆగష్టు 5 : కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో కేవలం 14 మందికి మాత్రమే రైతు రుణమాఫీ జరిగిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్ తెలిపారు. అర్హులైన అందరికీ ఆగస్టు 15 లోపు రుణమాఫీ చేస్తామని దేవుళ్లపై ఒట్టు వేసిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు అదే దేవుళ్లను మోసం చేస్తున్నాడని ఎమ్మెల్యే వివేకానంద విమర్శించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు.

రైతు రుణమాఫీకి సమాధానం చెప్పాలని మొదట్నుంచి డిమాండ్ చేస్తున్నాం. రైతు భరోసాపై చర్చ పెడుతామని చెప్పి దాటవేశారు. శాసనసభలో తప్పించుకుని పారిపోయారు. రైతు రుణమాఫీపై చర్చ పెడుతామని చెప్పారు. కానీ అసెంబ్లీ సమావేశాల్లో చర్చ పెట్టలేదు. రైతు రుణమాఫీ, రైతు భరోసాపై రైతాంగం వెయి కండ్లతో అసెంబ్లీ వైపు చూసింది. కానీ బడ్జెట్ చర్చ, ద్రవ్య వినిమయ బిల్లు చర్చ, వ్యవసాయ శాఖపై చర్చ సందర్భంగా సీఎం, డిప్యూటీ సీఎం, వ్యవసాయ శాఖ మంత్రి ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. ఈ బడ్జెట్ గ్యాస్ ట్రాష్ అని కేసీఆర్ మొట్టమొదటి రోజే చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రజల్లో విశ్వాసం కోల్పోయారు. ఆరు గ్యారెంటీలను వంద రోజుల్లో అమలు చేయలేదు. రైతు రుణమాఫీ విషయంలో పార్లమెంట్ ఎన్నికల్లో దేవుళ్లపై ఒట్లు పెట్టి ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. రైతులను వేడుకున్నారు. కానీ రైతులకు లాభం జరగలేదు.. చివరకు దేవుళ్లను కూడా సీఎం మోసం చేసిండు. ఆగస్టు 15 లోపు చేస్తానన్నాడు.. ఇప్పుడేమో నెలఖారు చివరకు వరకు చేస్తామంటున్నాడని ఎమ్మెల్యే వివేకానంద ధ్వజమెత్తారు.

నా నియోజకవర్గంలోని బోరంపేట్ ప్రాథమిక వ్యవసాయ శాఖకు సంబంధించిన బ్యాంకులో 632 మంది రుణాలు తీసుకుంటే అందులో కేవలం 14 మందికి ఇప్పటి వరకు రుణమాఫీ జరిగింది. మొదటి విడతలో 11 మందికి, రెండో విడతలో ముగ్గురికి మాత్రమే మాఫీ అయింది. ఇది కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న చిత్తశుద్ధి. ఇంత మోసపూరితమైన ప్రభుత్వాన్ని గతంలో ఎప్పుడు చూడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అబద్దాలు, మోసాలతో నడుస్తోంది. రైతుభరోసాకు నిధులు కేటాయించలేదు. అసెంబ్లీలో అనేక అంశాలపై నిలదీస్తే.. తిట్ల పురాణం అందుకున్నారు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు. దశదిశ నిర్దేశించే అసెంబ్లీని అప్రతిష్టపాలు చేశారు. చాలా అవమానపరిచారు.

# ఆర్-5 జోన్ లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు స్వంత ప్రాంతాల్లోనే ఇళ్ల స్థలాలు

## -సిఎం చంద్రబాబు నాయుడు సంచలన నిర్ణయం

అమరావతి ఆగష్టు 5 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఆర్-5 జోన్ లబ్ధిదారుల అంశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆర్-5 జోన్ లో ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులకు స్వంత ప్రాంతాల్లోనే ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నిర్ణయించారు. అవసరమైతే టిడ్కో ఇళ్లను నిర్మించి ఇవ్వాలనే అభిప్రాయానికి వచ్చారు. అమరావతిలో చంద్రబాబు హయాంలోనే తొమ్మిది జోన్లుగా విభజించారు. దానికి సంభందించి జీవో కూడా విడుదల చేశారు. వీటిలో ఆర్-5 జోన్ కీలకం. ఇది రాజధాని ప్రాంతంలో 900 ఎకరాల స్థలం. మాస్టర్ ప్లాన్ లో పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్యాల సముదాయాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ ప్రాంతం రాజధానికి మరో ఆదాయ వనరుగా మారుతుందని భావిస్తున్నారు.

# ప్రభుత్వం స్కూల్స్‌లో డిజిటల్ విద్యే లక్ష్యం



హైదరాబాద్, ఆగష్టు 5 :ప్రభుత్వ స్కూల్స్‌లో డిజిటల్ విద్యే లక్ష్యంగా అడుగులు వేస్తున్నట్లు అసోసియేషన్ ఆఫ్ 41 క్లబ్స్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు 41ఈఆర్ శ్రీనివాసు సరస్వతుల తెలిపారు. అసోసియేషన్ ఆఫ్ 41 క్లబ్స్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్ ది పార్క్ హోటల్లో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెట్రో నగరాల్లో ఉన్న విద్యార్థులు మరింత మెరుగ్గా నేర్చుకోవడంలో సహాయపడుతుందని చెప్పారు. 1.50 కోట్ల బడ్జెట్‌తో 1.50 లక్షల మంది విద్యార్థులకు ఈ ప్రాజెక్టు కింద లబ్ది చేకూరనుందన్నారు. ఈ లాంగ్ టర్మ్ ప్రాజెక్ట్ 'ఫ్రీడం త్రూ డిజిటల్ ఎడ్యుకేషన్' కింద ఆగస్టు 2024 నాటికి 300 స్కూల్స్‌లోని తరగతి గదులను డిజిటల్ స్మార్ట్ క్లాస్ రూమ్‌లుగా మార్చేందుకు అసోసియేషన్ ఆఫ్ 41 క్లబ్స్ ఆఫ్ ఇండియా సిద్ధంగా ఉందన్నారు. తెలంగాణలో యాభై తరగతి గదులను డిజిటలైజ్ చేసేందుకు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని చెప్పారు. సమాజంలో అణగారిన వర్గాల విద్యార్థులు, మాతృభాషా మాధ్యమాన్ని అభ్యసించే ప్రభుత్వ పాఠశాలలు లేదా సహాయం పొందిన పాఠశాలలకు డిజిటల్ విద్య కింద హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ సాధనాలు అందించనున్నామని తెలిపారు. ఇది విద్యలో భౌగోళిక, ఆర్థిక ప్రతికూలతను తొలగిస్తుందన్నారు. భారతదేశం డిజిటల్ ఇండియాగా, ఐదు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారాలంటే.. ఈ యువ హృదయాలను డిజిటల్ విద్యా సాధనాల వైపు మళ్లించాలన్నారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు రాష్ట్ర బోర్డ్ లేదా సీబీఎస్ఈ పాఠ్యాంశాలతో పాటు ఇతర సహ-పాఠ్యాంశ సాఫ్ట్‌వేర్‌లతో పాటు అభ్యాసాన్ని ఆకర్షణీయంగా, వినోదభరితంగా చేయడానికి విద్యా సాఫ్ట్‌వేర్‌ను అందిస్తున్నామని వివరించారు. ఇంగ్లీష్‌తో పాటు హిందీ, గుజరాత్, మరాఠీ, తెలుగు, కన్నడ, బెంగాలీ, ఒరియా, అస్సామీలలో పాఠ్యాంశాలను అందిస్తున్నామన్నారు. తమిళనాడు, కేరళ రాష్ట్రాలు తమ సొంత విద్యా సాఫ్ట్‌వేర్‌ను తప్పనిసరిగా ఉపయోగిస్తున్నాయని తెలిపారు. భారతదేశంలో చాలా వరకు కవర్ చేశామన్నారు. డిజిటల్ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించేలా ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామన్నారు. స్టాండ్, స్క్రీన్, కీబోర్డ్, మౌస్, వోల్టేజ్ స్టెబిలైజర్‌తో టీవీ లేదా ప్రొజెక్టర్ వంటి అవసరమైన హార్డ్‌వేర్‌ను అందిస్తామన్నారు. ఈ సిస్టమ్ రోజువారీ ఆపరేషన్ కోసం ఇంటర్నెట్ అవసరం లేదన్నారు. ఆగస్ట్ 2024 చివరి నాటికి సుమారు 300 పాఠశాలలను పూర్తి చేస్తామనారు.


Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana.
Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.
'Editor: B. Devadas.
**RNI No.52865/93.** E-mail :netinijam93@gmail.com.